నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 1 మే 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




## అంబేద్కర్ ఆశయ సాధనకు
# కృషి చేయాలి

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 30 : భారత రత్న, రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పిలుపు నిచ్చారు. బుధవారం ఆసిఫాబాద్ మండలంలోని గుండి గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన అడుగుజాడల్లో యువకులు నడవాలన్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం భీం సైనిక్ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అరిగేల నాగేశ్వర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ సర్పంచ్ జబరి అరుణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జాబరి రవీందర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

## పదో తరగతి ఫలితాల్లో మంచిర్యాల జిల్లా 17వ స్థానం

నస్పూర్, ఏప్రిల్ 30 : పదవ తరగతి ఫలితాల్లో మంచిర్యాల జిల్లా 17వ స్థానంలో నిలిచినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. జిల్లాలో మొత్తం 9179 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8861 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. బాలురు 96.14 శాతం, బాలికలు 96.96 శాతం, జిల్లా వ్యాప్తంగా 96.54 శాతం నమోదైందని తెలిపారు. రీకౌంటింగ్ కోరుకునే విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ. 500 చెల్లించాలన్నారు. జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని, విద్యార్థులు ఈ నెల 16లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన సాయిశ్రీవల్లి 588, జీ సిరి 586, కాసిపేట మండలానికి చెందిన వినూత్న 585 మార్కులతో టాపర్లుగా నిలిచారు.


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్లు

## మిమ్స్ ప్లే హైస్కూల్ ప్రతిభ

నస్పూర్, ఏప్రిల్ 30 : పదవ తరగతి ఫలితాల్లో మంచిర్యాలలోని మిమ్స్ ప్లే అండ్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ శ్రీనివాస్‌రాజు, డైరెక్టర్లు ఉపేందర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. త్వరిత 581, కుషాల్ 580, వర్షిత 580, సాయిగణేశ్ 578, స్నేహిత 574, వైష్ణవి 574, హర్షిణి 573, హాసిని 561, రిశ్వితశ్రీ 558 మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరిని కరస్పాండెంట్, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

# ధాన్యం కొనుగోళ్లకు ఎదురుచూపులు

**అధికారుల సమీక్షలకే పరిమితమవుతున్న కొనుగోలు కేంద్రాలు**

- అకాల వర్షంతో ఆందోళన
- విధిలేని స్థితిలో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించేందుకు సిద్ధమవుతున్న రైతన్నలు


పెంచికల్‌పేట్‌లో కల్లాంలో వడ్ల కుప్పలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : వరి ధాన్యం విక్రయించేందుకు రైతన్నలకు ఎదురుచూపులు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి ఎప్పుడు కొంటారోనని నిరీక్షిస్తూ పడిగాపులు కాస్తున్నారు. మరో వైపు మబ్బులు పడుతున్న వాతావరణం అన్నదాతలను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. అకాల వర్షాల నుంచి కల్లాల్లో ధాన్యాన్ని కాపాడుకునేందుకు కష్టాలు పడుతున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో దాదాపు వరి కోతలు పూర్తయ్యాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేస్తున్న సమావేశాలు సమీక్షలకే పరిమితమయ్యాయి. ఇప్పటికే పలు దఫాలుగా సమీక్షా సమావేశాలు నిర్వహించిన అధికారులు జిల్లాలో ఇంత వరకు ఒక్క కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయలేదు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా 34 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఇందుకోసం కావాల్సిన చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న అధికారులు ఇంతవరకు ధాన్యం కొనుగోళ్లకు మాత్రం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. ప్రభుత్వం నిర్ణయించిన ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2320, బీ గ్రేడ్ రకానికి రూ.2300 నిర్ణయించింది. జిల్లాలో యాసంగి ధాన్యం 56,588 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో వరి కోతలు ముగిసినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం, మరోవైపు చేతికి వచ్చిన పంట అకాల వర్షం పాలవుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

### కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



మా దగ్గర వరి కొతలు ముగిసి దాదాపు వారం రోజులవుతున్నది. రైతులందరం ధాన్యాన్ని కల్లాల్లోనే కుప్పలుగా పోసుకొని విక్రయించేందుకు ఎదురుచూస్తున్నాం. ఈ పరిస్థితి గతంలో ఎప్పుడూ మాకు ఎదురుకాలేదు. కాని ఇప్పుడు పంటను అమ్ముకునేందుకు ఎదురుచూడాల్సి వస్తున్నది. దీనికి తోడు ఆకాశంలో పడుతున్న మబ్బులను చూస్తే భయమేస్తున్నది. వాన వస్తే చాలా నష్టపోవాల్సి వస్తోంది. రెండు రోజులు క్రితం వచ్చిన తేలికపాటి వర్షాలతోనే కొంత మేర ధాన్యం తడిసిపోయింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ధాన్యాన్ని వెంటనే కొనేందుకు ఏర్పాట్లు చేయాలి. అధికారులు ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ప్రైవేట్‌లో విక్రయించాల్సిన పరిస్థితి వస్తుంది.

*- ఒండ్రె వెంకటి, రైతు ఎల్లూరు*

### 15 రోజులుగా ఎదురు చూస్తున్న..



నేను పొలం కోసి దాదాపు 15 రోజులు అవుతున్నది. అప్పటి నుంచి నేను ధాన్యం విక్రయించేందుకు కల్లంలోనే వడ్ల కుప్పలు పోసుకొని ఎదురు చూస్తున్నారు. ఇంత వరకు అధికారులు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు మాకు ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదు. వరి ధాన్యం చేతికి వచ్చేకంటే 15 రోజుల ముందే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవాళ్లు. ఇప్పుడు కల్లాల్లో ధాన్యం పోసుకొని 15 రోజులైనా కొనేటోళ్లు లేరు. ఒక్క వాన వస్తే మేము పడ్డ కష్టం అంత నీళ్లపాలవుతుంది. అధికారులు మా బాధలను పట్టించుకొని వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి.

*- చిన్నబోయిన చిన్నన్న రైతు ఎల్లూరు*





కె.భార్గవి, 567


కె.శృతి, 557


సాయి శ్లోకా, 555

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 30: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో కాగజ్‌నగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో 38 మంది విద్యార్థులకు గాను అందరూ పాసై వంద శాతం ఉత్తీర్ణతా శాతాన్ని నమోదు చేశారు. కే భార్గవి 600 మార్కులకు 567, కే శృతి 557, ఎస్ సాయి శ్లోకా 555, డీ సాన్వి 555, పీ స్పందన 549 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా వీరిని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ సురవర్ధన్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.


డీ.సాన్వి, 555


పీ.స్పందన, 549

## షరతులు లేకుండా ధాన్యం కొనాలి

లక్షెట్టిపేట ఏప్రిల్ 30: కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి షరతులు లేకుండా వడ్లను కొనాలని, బస్తాకు రెండు కిలోలు అదనంగా కాంటా వేస్తూ కాంగ్రెస్ సర్కారు దోపిడీ చేయడం మానుకోవాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం లక్షెట్టిపేట మండలంలోని గుల్లకోట గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి కటింగ్ లేకుండా వడ్లను కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, కొనుగోలు కేంద్రంలో మాత్రం ప్రతి 40 కేజీల బస్తాకు రెండు కేజీలు అదనంగా కాంటా వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటున్నదని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఎలాంటి కటింగ్ లేకుండా, షరతులు లేకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి అండగా ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తిప్పని లింగయ్య, గుల్లకోట మాజీ సర్పంచ్ గొల్ల రవీందర్, నాయకులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

## వడగళ్లు..కడగండ్లు

**దెబ్బతిన్న పంటలు..కల్లాల్లో తడిసిన వడ్లు**

భీమారం, ఏప్రిల్ 30 : మంచిర్యాల జిల్లాలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వానతో చేతికి వచ్చిన పంటలు దెబ్బతినగా..కల్లాల్లో వడ్లు తడవడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. భీమారం మండల కేంద్రంలో పాటు పలు గ్రామాల్లో కురిసిన వడగళ్లవానతో మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడిసిపోయాయి. చేతికి వచ్చిన పంటలు నష్టపోయామని రైతులు కన్నీరు పెట్టుకున్నారు. మంచిర్యాల-జగ్దల్‌పూర్ జాతీయ రహదారిపై పోలంపల్లి శివారులో ఈదురు గాలులకు భారీ వృక్షాలు, కొమ్మలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎస్ఐ శ్వేత సిబ్బందితో అక్కడికి చేరుకొని జేసీబీతో తొలిగించారు.

### గుండ్లసోమారంలో దెబ్బతిన్న పంటలు..ధ్వంసమైన ఇండ్లు

నెన్నెల, ఏప్రిల్ 30 : మండలంలో కురిసిన వడగళ్ల వానకు కోతకు వచ్చిన వరి చేలు నేలకొరిగాయి. మామిడి కాయలు రాలిపోయాయి. కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. గుండ్ల సోమారంలో ఆరు రేకుల ఇండ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు విరిగి పడడంతో భీమారం-ఆవుడం రహదారిపై రాకపోకలకు అంతరాయం కలిగింది.


నెన్నెల మండలం గుండ్ల సోమారంలో రాళ్ల వానకు దెబ్బతిన్న జొన్నపంట


నెన్నెల మండలంలో కురిసిన వడగళ్లు

